నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 25 మార్చి 2025 | NIZAMABAD

# కొట్టుకున్న కాంగ్రెస్ నేతలు

**లాఠీచార్జి చేసి చెదరగొట్టిన పోలీసులు • వర్ని మండలంలో ఘటన**

వర్ని(రుద్రూర్), మార్చి 24: బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలంలో కాంగ్రెస్ నేతలు ఆదివారం రాత్రి కొట్టుకున్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు ఘర్షణకు దిగారు. పోలీసులు వచ్చి లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. రెండు వర్గాలకు చెందిన 25 మందిపై కేసులు నమోదు చేశారు. కోటగిరి మండలానికి చెందిన కొందరు కాంగ్రెస్ నేతలు (పోచారం వర్గీయులు) ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో వర్నిలో టీ పాయింట్ వద్ద టీ తాగుతూ మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో వర్ని మండలానికి చెందిన అధికార పార్టీ నేతలు (ఏనుగు వర్గీయులు) అక్కడే ఉండడంతో మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాలు కొట్టుకుంటున్నారని సమాచారమందుకున్న పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. రెండు వర్గాలకు చెందిన 25 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



వర్నిలో కొట్టుకుంటున్న ఇరు వర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

# కేసులు పెడితే సహించేది లేదు..

- మేమూ కేసులు పెడతాం.. పరోక్షంగా సునీల్‌రెడ్డికి హెచ్చరిక
- సోషల్ మీడియాలో ఈరవత్రి వీడియో వైరల్

మోర్తాడ్, మార్చి 24: కార్యకర్తలపై కేసులు పెడితే ఊరుకునేది లేదని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌కు చెందిన ఈరవత్రి వర్గీయులు ముగ్గురిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో భీమ్‌గల్ పట్టణంలో సోమవారం నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఈరవత్రి అనిల్ మాట్లాడిన ఓ వీడియో వైరల్ అవుతున్నది. కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడిన వీడియో సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నది. 'ఇక్కడ ఉన్న కార్యకర్తలపై కేసులు పెట్టడం మంచిది కాదు, ఏదన్నా ఉంటే మనంమనం తేల్చుకోవాలా.. లేదంటే పీసీసీ అధ్యక్షుడితో మాట్లాడుకుందం. నాపైన, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేసినవు, మేము మోసం చేసినమని, మోసగాళ్లని సోషల్‌మీడియాలో రాసినవు, మాదగ్గర ఆధారాలు ఉన్నాయి, మేము కేసులు పెట్టాలంటే పెట్టరాదా, కాంగ్రెస్ పార్టీ కోసం నాఆస్తులు అమ్ముకున్నా. అయినా పార్టీ మారలేను. అసెంబ్లీ ఎన్నికల్లో నేను ప్రశాంత్‌రెడ్డికి అమ్ముడుపోయిన అంటరా.. నేను డిఫర్మేషన్ కేసు పెట్టి బజారుకీడుస్తా ..'అని హెచ్చరించారు. మరోసారి కార్యకర్తలను వేధిస్తే తాను, మోహన్‌రెడ్డి ఊరుకునేటోళ్లం కాదన్నారు. తప్పుచేయకున్నా కేసులు పెడితే సహించబోమన్నారు.

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా
- కాంగ్రెస్ పాలనలో రైతుల తిప్పలు
- మైనార్టీల కోసం కొట్లాడేది బీఆర్ఎస్సే
- కాంగ్రెస్ ఇస్తామన్న తులం బంగారం ఏమైంది
- రంజాన్ తోఫాలు ఎందుకియ్యడం లేదు
- రేవంత్ సర్కారుపై కవిత ప్రశ్నల వర్షం
- బాన్సువాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు ఆయేషా ఫాతిమా, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్

# రేవంత్ ఫ్లైట్ మోడ్ సీఎం

**ఏం చేయాలన్నా ఢిల్లీ పర్మిషన్ తీసుకోవాలి**





గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

బాన్సువాడ, మార్చి 24: రేవంత్‌రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం.. 15 నెలల్లో 40 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్‌రెడ్డి తెలంగాణకు సాధించుకొచ్చింది ఏమీ లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా పాలన నడుస్తున్నదా.. లేక ఢిల్లీ కేంద్రంగా నడుస్తున్నదా? అని కవిత ప్రశ్నించారు. ఈ సీఎం ఏం చేయాలన్నా, ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఢిల్లీకి వెళ్లి పర్మిషన్ తెచ్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాన్సువాడలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పదేండ్లలో కేసీఆర్ సర్కారు మైనార్టీల సంక్షేమానికి అండగా నిలిస్తే, 15 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు ఇచ్చే తోఫాలు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. మైనార్టీల సంక్షేమం కోసం పెట్టిన బడ్జెట్‌లో కనీసం 25 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదన్నారు.

**మత ఘర్షణలు..**

కేసీఆర్ అధికారంలో ఉన్న పదేండ్లలో ఒక్క మత ఘర్షణ జరగలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో నెలకో మత ఘర్షణ చోటు చేసుకున్నదని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సీఎం ఏ ఒక్కరోజైనా సమీక్షించిన పాపాన పోలేదన్నారు. జైనూరులో మూడు నెలలు ఇంటర్నెట్ బంద్ పెట్టారని, అక్కడ హిందూ, ముస్లింల ఇండ్లను దహనం చేసినా రేవంత్‌రెడ్డికి పట్టించుకునే తీరిక లేదని విమర్శించారు. బాధితులకు కనీసం పరిహారం ఇవ్వలేదని, బాధ్యులపై చర్యలు కూడా తీసుకోలేదన్నారు.

**రైతుల గోస పట్టని సర్కారు..**

కేసీఆర్ సర్కారు పుష్కలంగా సాగునీరు ఇవ్వడంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపించేదని కవిత గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ఎండుతున్న పొలాలు చూసి రైతులు గోస పడుతుంటే ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తాను హైదరాబాద్ నుంచి బాన్సువాడ నియోజకవర్గానికి వస్తుంటే దారి పొడువునా రైతులు ఆపి తమ కష్టాలను చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సాగునీటి కష్టాలు వచ్చాయని, కేసీఆర్ హయాంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండే అని రైతులు తెలిపారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని నీరుగార్చిందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. రేవంత్ సర్కార్ ఇస్తామన్న రైతుబంధు ఇవ్వలేదు.. బోనస్ కొంత మందికే ఇచ్చిచేతులు దులుపుకొన్నదని విమర్శించారు. రైతులు అన్నీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారన్నారు.

**ఇఫ్తార్‌కు ఇంటికొస్తే పోచారాన్ని అడుగండి..**

'పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రభుత్వానికి సలహాదారుడు అయ్యిండు. ఆయన ఏం సలహాలు ఇస్తున్నారో రంజాన్ పండుగ సందర్భంగా మీ ఇంటికో, మీ కాలనీకో వస్తే ప్రశ్నించండి. మైనార్టీ గురుకులాలు కేసీఆర్ హయాంలో ఎలా ఉన్నాయి.. ఇప్పుడు ఎలా ఉన్నాయో పోచారంను అడుగండి' అని కవిత అక్కడున్న వారికి సూచించారు. బాన్సువాడకు సాగునీళ్లు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే పోచారం మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏమైంది?**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయలేదని కవిత విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం రూ.1800 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిపోతే కేసీఆర్ సీఎం అయ్యాక ఆ బకాయిలు క్లియర్ చేసి, విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా చూశారని గుర్తు చేశారు. పోచారం ప్రభుత్వంతో మాట్లాడి విద్యార్థులకు ఫీజు బకాయిలు ఇప్పించాలని సూచించారు. 'కేసీఆర్ షాదీముబారక్ కింద లక్ష మాత్రమే ఇస్తుండు.. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.1.60 లక్షలతోపాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. మరీ 15 నెలలల్ల ఏ ఒక్కరికైనా 1.60లక్షలతో పాటు తులం బంగారం ఇచ్చారా?' అని ప్రశ్నించారు. 15 నెలల్లో 1.50 లక్షల కోట్ల అప్పులు చేసినా తులం బంగారం ఇవ్వలేదన్నారు. వీటన్నింటిపై సీఎంను ఒప్పించి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## సొంత లాభం కోసమే పార్టీ మారిండు: బాజిరెడ్డి



బాన్సువాడలో బీఆర్ఎస్ తరపున గెలిచిన పోచారం సొంత లాభం కోసమే పార్టీ మారిండని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. కాంగ్రెస్‌లోకి పోయిన తర్వాత బాన్సువాడకు చేసిందేమన్నా ఉందా? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలోనే బాన్సువాడ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ ఏజెంట్.. ఇలాంటి వ్యక్తి సీఎంగా ఉండొద్దని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సేవ చేయని రేవంత్‌రెడ్డికి సీఎం కుర్చీలో కూర్చునే అర్హత లేదన్నారు. బాన్సువాడలో ఎమ్మెల్యే పార్టీ మారినా బీఆర్ఎస్‌కు ఆదరణ తగ్గలేదన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ బీఆర్ఎస్‌ను ముందుకు నడిపిస్తున్నారన్నారు.



## జీపీ కార్మికుల నిరసన

తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని కోరుతూ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నెలనెలా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు ఇవ్వడంతోపాటూ పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.
–కంఠేశ్వర్, మార్చి 24

రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఆశ కార్యకర్తలు



# ఖాకీ రాజ్యం

- అటు రైతులు.. ఇటు ఆశ కార్యకర్తలు
- ముందస్తు పేరిట అక్రమ అరెస్టులు
- ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆందోళనలపై ఖాకీలను ఉసిగొల్పుతున్న వైనం
- కలెక్టరేట్ల వద్ద నిరసనలు చేపట్టొద్దని తాజాగా ఆదేశాలు

**ప్రజా పాలనలో నిర్బంధ కాండ**

కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో శాంతియుత నిరసనలకు తావు లేకుండా పోయింది. సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తే అవకాశమే లేకుండా ప్రభుత్వం నిర్బంధ కాండ విధించింది. ఖాకీలతో రాజ్యాన్ని నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరసనలపై ఉక్కుపాదం మోపుతున్నది. డిమాండ్ల సాధన కోసం పోరుబాట పట్టిన ఉద్యోగులు, ఉద్యమ సంఘాలపై లాఠీ ఎక్కుపెడుతున్నది. మొన్న శాంతియుతంగా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను ఈడ్చుకెళ్లిన ఉదంతం మరువక ముందే తాజాగా ఆశ వర్కర్లు, రైతు నాయకులను సోమవారం అక్రమంగా నిర్బంధించింది. న్యాయం చేయమని అడిగేందుకు హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమైన వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. కామారెడ్డి బస్టాండ్‌లో నిల్చున్న ఆశ కార్యకర్తలను.. నేరస్తులను తరలించినట్లు పోలీసు జీపుల్లో తరలించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు, నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద నిరసనలు చేపట్టకుండా సర్కారు నిషేధం విధించింది. ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ప్రజా పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నిస్తున్నాయి.

## 'నిరసనల'పై ఉక్కుపాదం!

కంఠేశ్వర్, మార్చి 24 : తమది ప్రజాపాలన అని గొప్పగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హక్కులపై ఉక్కుపాదం మోపుతున్నది. తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టే నిరసన కార్యక్రమాలపై నిషేధాజ్ఞలు విధిస్తున్నది. నిజామాబాద్ కలెక్టరేట్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టడం నిషేధమని, ఒకవేళ ఎవరైనా నిరసన కార్యక్రమాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకోబడుతాయని పోలీసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం గమనార్హం.




## రైతు నాయకుల అక్రమ అరెస్టు

**జగిత్యాల జిల్లా రైతు జేఏసీ తలపెట్టిన 'చలో అసెంబ్లీ'ని అడ్డుకున్న పోలీసులు**


నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 24: జగిత్యాల జిల్లా రైతు జేఏసీ తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా నిజామాబాద్ జిల్లా రైతు నాయకులను పోలీసులు నిర్బంధించారు. అక్రమంగా ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా రైతు జేఏసీ సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా జిల్లాలోని కమ్మర్‌పల్లి, వేల్పూర్, ముప్కాల్, ఆర్మూర్ మండలాల్లో రైతులతోపాటు రైతునాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.



ఆర్మూర్‌లో రైతు జేఏసీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

# పైరవీలకే పెద్దపీట

- ఉద్యోగ బదిలీల్లో కరువైన పారదర్శకత
- అర్హులకు అన్యాయం.. సిఫార్సు ఉన్న వారికే అనువైన స్థానం
- తహసీల్దార్ల స్థాన చలనంలో అనేక లోటుపాట్లు
- పైరవీలు, అధికార పార్టీ లీడర్ల సిఫార్సులకే పెద్దపీట
- ఎల్లారెడ్డి డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మృతితో చర్చ
- ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



నిజామాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) కాంగ్రెస్ పాలనలో పారదర్శకత లోపించింది. ఉద్యోగుల బదిలీల్లో అది కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. పైరవీలు, అధికార పార్టీ నేతల సిఫారసులకే పెద్దపీట వేస్తుండడంతో అర్హతలు ఉన్న వారికి అన్యాయం జరుగుతున్నది. ఆర్మూర్‌కు చెందిన తహసీల్దార్ ఉదంతమే అందుకు ఉదాహరణ. తీవ్రమైన డయాబెటీస్‌తో బాధ పడుతున్న ఆయనను మాటిమాటికీ బదిలీల పేరుతో చిత్రవధకు గురి చేయడంతో హఠాన్మరణం చెందారు. తహసీల్దార్ భార్య ప్రభుత్వ టీచర్ కాగా, స్పౌస్ కేటగిరీలోనైనా ఆయనను కోరుకున్న చోటికి బదిలీ చేయాలి. ఏడాదిన్నరలోనే ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన, అడిగిన స్థానం ఇవ్వకపోగా, పలుమార్లు బదిలీ చేశారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్ఏ) స్థాయిలోనైనా న్యాయంగా బదిలీ చేయించుకోవాలని యత్నించినా ఫలించలేదు. ఎన్నికల కోడ్‌తో మొదటి బదిలీ కాగా, అనతి కాలంలోనే నాలుగైదు సార్లు స్థానభ్రంశం చేశారు. బాన్సువాడలో పని చేస్తుండగా, అకస్మాతుగా ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్ కేంద్రంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పంపించారు. ఏం జరుగుతున్నదో అర్థం కాని దుస్థితిలో తనకు జరుగుతున్న అన్యాయంపై తీవ్ర మనస్తాపానికి గురైన సదరు తహసీల్దార్ చివరకు ఊపిరి వదిలాడు. పారదర్శకత లేని బదిలీల కారణంగా తోటి ఉద్యోగి మృతి చెందడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**చేష్టలుడిగిన రెవెన్యూ సంఘం..**

ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల వద్ద రెవెన్యూ ఉద్యోగుల సంఘ నేతల మాటకు తిరుగుండదు. ఆ నాయకులకు దక్కే విలువ కూడా అలాగే ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెవెన్యూ ఉద్యోగుల సంఘం తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కేసీఆర్ సర్కారు చర్యలకు చీటికీ మాటికి అడ్డు పడుతూ కాళ్లలో కట్టెలు పెట్టేలా ప్రవర్తించిన కొంత మంది నాయకులు ఇప్పుడు పాలకుల అడుగులకు మడుగులొత్తుతూ విమర్శల పాలవుతున్నారు. ఉద్యోగులకు అన్యాయం జరుగుతుంటే పోరాటం చేయాల్సిన తరుణంలో సంఘం నేతలు మౌనంగా ఉండడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు.

**కళంకితులకే ప్రాధాన్యత?**

కాంగ్రెస్ పాలనలో ఉద్యోగుల బదిలీలు, డిప్యూటేషన్లలో ఇష్టారాజ్యం నడుస్తున్నది. ఉమ్మడి జిల్లాల్లో పలువురికి దక్కుతున్న ఎనలేని ప్రాధాన్యత ముక్కున వేలేసుకునేలా చేస్తున్నది. నిజామాబాద్ కలెక్టరేట్‌లో పరిపాలన అధికారిగా ఏండ్లుగా ఒకే వ్యక్తి తిష్ట వేశాడు. అంతకు ముందు ఓ మండలానికి తహసీల్దార్‌గా పని చేసిన సదరు వ్యక్తిని ఉన్నతాధికారులు కనీసం టచ్ చేయట్లేదు. ఈయన తన భార్యకు సైతం అనుకున్న చోట పోస్టింగ్ ఇప్పించుకుని దర్జాగా కాలు కదపకుండానే విధులు నిర్వహిస్తున్నాడు. రెవెన్యూ సంఘం రాష్ట్ర నాయకుడిగా ప్రచారం చేసుకునే మరో అధికారి సైతం దశాబ్ద కాలంగా జిల్లా కేంద్రాన్ని దాటి వెళ్లడం లేదు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఆయా సెక్షన్లలో పని చేసిన సూపరింటెండెంట్లు కూడా ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని మంజీరా తీర ప్రాంతాల్లోని మండలాలకు బదిలీ చేయించుకున్నారు. ఒకవేళ బదిలీ జరిగితే తిరిగి ఆయా సెక్షన్లకే వచ్చి తిష్ట వేస్తున్నారు. మరోవైపు, నిజాయితీపరులుగా ముద్ర పడిన తహసీల్దార్లు ఏండ్లుగా లూప్‌లైన్ లో పని చేస్తున్నారు. వీరిని మండలాలకు పంపించట్లేదు. కామారెడ్డిలో తాజాగా జరిగిన బదిలీల్లో కళంకితులకు ఇసుక మేటలు ఉన్న మండలాలకు పోస్టింగ్‌లు దక్కాయి. ఎమ్మెల్యేల సిఫార్సులతో కొంత మంది బదిలీలు చేయించుకోవడం గమనార్హం.